# టీటీడీ నూతన ఛైర్మన్ బి.ఆర్.నాయుడుకు ఎమ్మెల్యే బడేటి చంటి శుభాకాంక్షలు

**హైదరాబాద్/ఏలూరు,సూర్యబ్యూరో :** తిరుమల తిరుపతి దేవస్థానం ఛైర్మన్‌గా నూతనంగా నియమితులైన బిఆర్ నాయుడుని మర్యాదపూర్వకంగా కలిసిన ఏలూరు నియోజకవర్గ శాసనసభ్యులు బడేటి రాధాకృష్ణయ్య (చంటి). టీవీ5 న్యూస్ ఛానల్ ఛైర్మన్ కూడా అయిన బిఆర్ నాయుడుకు ఎమ్మెల్యే పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు.




18వ వసంతం
నేటి దినపత్రిక సూర్య
www.suryaa.com
ఏలూరు జిల్లా, పశ్చిమ గోదావరి జిల్లా
సోమవారం,4 నవంబర్ 2024
8 పేజీలు


### ఏటా రూ.2,684 కోట్లతో

# ఉచిత గ్యాస్ పధకం

**- నిరుపేదలకు పెన్షన్‌లకు నెలకు రూ.2,710 కోట్లు - త్వరలో చింతలపూడి ఎత్తిపోతల పూర్తి - మంత్రి పార్థసారథి**





**చాట్రాయి,మేజర్‌న్యూస్:** ఏటా రూ.2,684 కోట్ల రూపాయలతో ఉచిత గ్యాస్ సిలెండర్ల పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్నారని రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖా మంత్రి కొలుసు పార్థసారథి చెప్పారు.రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న సూపర్ సిక్స్ హామీల అమలులో భాగంగా చాట్రాయి మండలంలోని చనుబండ గ్రామంలో మంత్రిదీపం 2.పథకానికి శ్రీకారం చుట్టారు. ఆదివారంలబ్ధిదారులకు గ్యాస్ సిలిండర్స్‌ను అందజేశారు.

ఈ సందర్భంగా ప్రభుత్వం ఏర్పడిన కొద్దీ రోజుల్లోనే అమలు చేస్తున్న సంక్షేమ,అభివృద్ధి పథకాలను ప్రజలకు మంత్రి వివరించారు ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలోని 1.08 కోట్ల మంది మహిళలకు దీపం పథకం కింద 3వంట గ్యాస్ సిలెండర్లు ఉచితంగా అందిస్తున్నామన్నారు.ఇందుకోసం ఏటా 2684 కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నామని మంత్రి వివరించారు. అంతేకాక రాష్ట్రంలోని 64.14 లక్షల మందిపేదలకు ప్రతీనెలా ఒకటవ తేదీనే పెన్షన్లు అందిస్తున్నామ న్నారు. ఇందుకోసం నెలకు 2710కోట్లరూపాయలు ఖర్చు చేస్తున్నామ న్నారు. ప్రజలకు సంక్షేమ పథకాలతో పాటు గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తుందని తెలిపారు జిల్లాలో రూ120 కోట్ల విలువైన పనులకు శంఖుస్థాపన చేశామన్నారు.ఈపనులన్నీ వచ్చే జనవరి నాటికి పూర్తిచేసేలా చర్యలు తీసుకున్నామన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ప్రతి నెలా ఒకటోవ తేదీన పెన్షన్ల కింద 4వేల రూపాయలు అందించడం జరుతుందన్నారు.గత ప్రభుత్వం ధాన్యం కొనుగోలుకు సంబంధించిన రూ.1600వందలకోట్ల రూపాయల బకాయిలను కూటమి ప్రభుత్వం రైతులకు చెల్లించిందని తెలిపారు. పారిశ్రామికంగా రాష్ట్రాన్ని అభివృద్ధిచేయడానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రత్యేకమైన దృష్టిని కేంద్రీకరిస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలోఐదు మేజరు ప్రాజెక్టులలో చింతలపూడి ఎత్తిపోతుల పథకం ఒకటని, రాబోయే రోజుల్లో ప్రాజెక్టును పూర్తిచేసి గోదావరి జలాలను సాగుకు వినియోగించేలా చేస్తామని మంత్రి తెలిపారు.



### ఎమ్మెల్సీ అభ్యర్థిని

# గెలిపించండి

**మంత్రి నిమ్మల, ఎమ్మెల్యే బొమ్మిడి**

**నర్సాపురం,మేజర్‌న్యూస్:** పట్టణంలోని అంబేద్కర్ సెంటర్‌లో ఆదివారం శాసనసభ్యులు బొమ్మిడినాయకర్ ఎమ్మెల్సీ ఓటర్ రిజిస్ట్రేషన్ డ్రైవ్ ఏర్పాటు చేశారు. రాష్ట్ర జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ఈడ్రైవ్‌ను ప్రారంభించారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వచ్చే మార్చి నెలలో జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల్లో గ్రాడ్యుయేట్ అయి అర్హత కలిగిన వారందరూ తప్పక ఓటును నమోదు చేయించుకొని ఎన్డీఏ కూటమి అభ్యర్థి అయిన పేరబత్తుల రాజశేఖర్‌కు ఓటువేసిమెజారిటీతో గెలిపించాలని కోరారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే బండారు మాధవ నాయుడు, టిడిపి ఇన్చార్జి పొత్తూరి రామరాజు,బిజెపి ఇంచార్జ్ మేకల సతీష్,జనసేన రాష్ట్రకార్యదర్శి చాగంటి మురళీకృష్ణ, నియోజవర్గ జనసేన టిడిపి బిజెపి నాయకులు జన సైనికులు, తదితరులు పాల్గొన్నారు.

### ఐదు నెలల్లోనే కూటమి ప్రభుత్వంపై

# ప్రజల్లో అసంతృప్తి

**- ఎమ్మెల్యే అడ్డగోలుగా మాట్లాడడం సరికాదు - మాజీ డిప్యూటీ సిఎం కొట్టు సత్యనారాయణ ధ్వజం**



**తాడేపల్లిగూడెం,మేజర్‌న్యూస్ :** తాడేపల్లిగూడెం వైసీపీ క్యాంపు కార్యాలయంలో మాజీ డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణఆదివారం మీడియా సమావేశం నిర్వహించారు. కూటమి ప్రభుత్వం 5నెలల కాలంలో 59వేల కోట్లు అప్పులు తెచ్చిందని,దానితో మీరిచ్చిన సూపర్ 6హామీలలో దేనికైనా వాడారా? అని ప్రశ్నించారు 5 నెలల పాలనలో ప్రజలు తిరస్కరించే స్థితికివచ్చారని ఆయన ధ్వజమెత్తారు. ప్రజలు మనకు ఓటు వేశారు అంటే ఆంబోతుకి అచ్చేసి వదిలేసినట్లు కాదని, అధికారంవస్తే ఇష్టమొచ్చినట్లు చేయడం కాదని కొట్టు సత్యనారాయణ విమర్శించారు. స్థానిక ఎమ్మెల్యే అడ్డగోలుగా మాట్లాడడం సరికాదన్నారు. ప్రజలకు జరుగుతున్న అన్యాయం మాట్లాడు తుంటే దానికి స్థానికఎమ్మెల్యేఇష్టమొచ్చినట్లు మాట్లాడుతున్నారని ఆరోపించారు. తాడేపల్లిగూడెంలో లాఅండ్‌ఆర్డర్ గురించి పట్టించుకున్నవా? మీ ప్రభుత్వం వచ్చిన 4నెలలకాలంలోపట్టణంలో 4మర్డర్‌లు జరిగాయని, నేరుగా బెల్టుషాపులు గురించి

- తరువాయి 2లో..

### టిడ్కో గృహ వాసుల కోసం

# రూ.8లక్షలతో కొత్తవాహనం





**- ప్రారంభించిన మంత్రి డా.నిమ్మల రామానాయుడు**

**పాలకొల్లు,మేజర్‌న్యూస్:**టిడ్కోగృహాల వాసులకు ధర్మారావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ8లక్షలు వ్యయంతో కొత్తవాహనాన్నికాలనీవాసులు, మహిళలు సమక్షంలో మంత్రి నిమ్మల రామా నాయుడు జెండా ఊపి ప్రారంభించారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ కాలనీవాసులు వివిధ పనుల నిమిత్తం గాంధీ బొమ్మలసెంటరు, ఆర్టీసీ బస్టాండు ,రైల్వే స్టేషను, తదితర ప్రాంతాలకు వెళ్ళాలి అంటే దూరం కావడంతో ఎటువంటి వాహనాలు లేక ముఖ్యంగా మహిళలు నడిచి వెళ్ళవలసి వచ్చేదన్నారు.ఒక్కొక్క మనిషి పట్టణ పనులకు వెళ్లాలంటే కనీసం ఆటో ఖర్చు 200 రూపాయలు అవుతుందని, నిరుపేదలు కనుక ఆసామ్ముతో

- తరువాయి 2లో..

# అమరవీరుల స్ఫూర్తితో ఆదివాసులు పోరాడాలి



**బుట్టాయిగూడెం,మేజర్ న్యూస్ :** అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా మండలంలోని నాగన్న గూడెం గ్రామంలో అమరుడు నాగన్న గంగిరెడ్డిల స్థూపం వద్ద పిఓడబ్ల్యు జిల్లా ప్రధాన కార్యదర్శి కురుసం లత అధ్యక్షతన సభ జరిగింది. ఈ సభలో సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ జిల్లా నాయకులు పోరండ్ల శ్రీనివాస్ మాట్లాడుతూ అమరవీరులు తమ జీవితాలను ఈ సమాజ మార్పు కోసం నూతన సమాజం కోసం త్యాగ చేశారని అన్నారు. వారు కన్న కలలను మనం నిజం చేయాలంటే వారి ఆశయాలను పుణికి పుచ్చుకొని వారి మార్గములో నడిచి ఈ ప్రభుత్వాలు అనుసరిస్తున్న ఆదివాసి వ్యతిరేక విధానాలకు బలమైన ఉద్యమా కారులుగా నిలిచి మన హక్కులను కాపాడుకోవాలని పిలుపునిచ్చారు.

అటవీ శాఖ మంత్రి, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ అడవులను విస్తరిస్తామని ప్రకటించారని గుర్తు చేశారు. ఇందులో ఆదివాసుల భూములను కలుపుకొని ఆదివాసులు సాగు చేసుకుంటున్నా పోడు భూముల నుండి గెంటివేసే కుట్ర దాగి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. వన్యమృగ సంరక్షణ అడవుల విస్తరణ( వైల్డ్‌లైఫ్ )అడుగులు పేరుతో ఆదివాసి గ్రామాలను పూర్తిగాఅడవి నుండి తొలగించి ఆదివాసులను గెంటివేయుటకు కుట్రలు పన్నుతున్నారని మండిపడ్డారు. అందులో భాగంగానే వైల్డ్ లైఫ్ ను విస్తరించే పేరుతో దాటుడు కాలువను బార్డర్ చేసుకున్నట్టుగా ఫారెస్ట్ అధికారులు ప్రచారం చేస్తున్నారని తరతరాలుగా ఆదివాసులు అడవులనే నివాసాలుగా చేసుకొని జీవిస్తు న్నారని ఆదివాసీల ఉనికిని లేకుండా చేసి అడవులను అటవీ సంపదను కార్పొరేట్ శక్తులకు అప్పచెప్పడం కోసం పాలకవర్గాలు పాకులాడుతు న్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో చిన్నారెడ్డి బాబుల్ రెడ్డి పండు రెడ్డి శ్రీరామ్మూర్తి రెడ్డి మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు .

# 6న మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

రాజవొమ్మంగి,మేజర్‌న్యూస్ : ఈ నెల6న మండల పరిషత్ సర్వ సభ్య సమావేశం నిర్వహించను న్నట్లు ఎంపీడీవో యాదగిరేశ్వరరావు తెలిపారు. ఎంపీపీ గోము వెంకటలక్ష్మి అధ్యక్షతన బుధవారం మధ్యాహ్నం గం1:00 కు నిర్వహించనున్న సర్వ సభ్య సమావేశానికి మండలానికి చెందిన ప్రజా ప్రతినిధులు హాజరవుతారని ఇందు నిమిత్తం వివిధ శాఖల అధికారులు ఇప్పటి వరకు జరిగిన అభివృద్ధి నిమిత్తం పూర్తి సమాచారంతో హాజరు కావాలని ఎంపీడీవో ఆదేశించారు. అలానే ఈ నెల 5 మధ్యాహ్నం గం 3:00 కు అధికారులు పూర్తి డేటా ఎంపీడీవో కార్యాలయంలో అందజేయాలన్నారు.

# ఉద్యోగులకు పెడింగ్ బకాయిలు విడుదల చేయాలి



కొత్తపేట, మేజర్ న్యూస్ : ఉద్యోగుల పెండింగ్ డి.ఏలు,ఐ.ఆర్ వెంటనే ప్రకటించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ స్థానిక ఎన్జీవో హెూం నందు అధ్యక్షులు మోటూరి రామారావు అధ్యక్షతన ఆదివారం ఏర్పాటు చేసిన కొత్తపేట యూనిట్ ఏపీఎన్జీవో కార్యవర్గ సమావేశంలో తీర్మానించారు.

ఈ సమావేశంలో రామారావు మాట్లాడుతూ ఏపీ ఎన్జీవో సభ్యత్వ నమోదు మరియు ఏపీ ఎన్జీవో మాసపత్రిక సభ్యత్వా ప్రక్రియలో భాగంగా ఉద్యోగులు అందరికీ ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని సంఘం తీర్మానించారు. పి.ఆర్.సి నూతన కమిటీని వెంటనే ప్రకటించాలని,ఉద్యోగులకు రావలిసిన పెడింగ్ బకాయిలు వెంటనే విడుదల చేయాలని సంఘం తీర్మానం తీసుకున్నారు.ఈకార్యక్రమంలో పూర్వపు అధ్యక్షుడు కొవ్వూరి ప్రభాకరరెడ్డి,కార్యదర్శి,నల్లా రామారావు,అసోసియేట్ అధ్యక్షుడు ఏపుగంటి సురేష్,ఉపాధ్యక్షులు నాగరాజు,సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

### ఐదు నెలల్లోనే కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో అసంతృప్తి

మొదటిపేజి తరువాయి

మీ ఎల్లో మీడియాలోనే రాస్తున్నారని అన్నారు. మాట్లాడేముందు సబ్జెక్టు తెలుసుకుని మాట్లాడాలని,రోడ్లు, గుంతలు గురించి మాట్లాడుతున్నారు కానీ 2014 నుండి 2019 మధ్య ఐదేళ్లలో ఎన్ని రోడ్లు వేశారని ప్రశ్నించారు. గత మావైసీపీ ప్రభుత్వంలో నవాబ్ పాలెం నుండి నిడదవోలు,చిలకంపాడు లాకుల నుండి వెంకట్రామన్న గూడెం వరకు రూ.45కోట్ల నిధులతో 4లైన్స్ రోడ్లు వేశాం కనబడట్లేదా? అని కొట్టు ప్రశ్నించారు. ఎక్కడ పేకాట ఆడుకుని ఎక్కడ నుండి వస్తావో తెలియని పరిస్థితి స్థానిక ఎమ్మెల్యేదని ఘాటుగా విమర్శించారు. మాజీ ముఖ్యమంత్రి వై ఎస్ జగన్మోహన్ రెడ్డి కుటుంబం గురించి మాట్లాడే ముందు తెలుసుకుని మాట్లాడాలని సూచించారు. చంద్రబాబు కుటుంబం గురించి మాట్లాడగలవా?అన్నారు. ప్రస్తుత ఎమ్మెల్యే ఇక్కడ మున్సిపల్ చైర్మన్‌గా ఉన్నపుడు శారదా గ్రంధాలయం విషయంలో ఏం జరిగిందో అందరికి తెలుసని, అప్పుడు నువ్వు డబ్బుల కోసం ఆపిన శారదా గ్రంధాలయం ప్రాంతంలో పెట్టిన వ్యాపారాన్ని నువ్వే ఇప్పుడు ప్రారంభోత్సవం చేశావని పేర్కొన్నారు. ప్రభాత ధియేటర్ వెనకాల చేసిన సెటిల్మెంట్‌లో ఎంత తీసుకు న్నావ్?, ఎల్ఈడి లైట్లు పేరు మీద ఎంత నొక్కేసావో.? అన్నారు. నా కొడుకుల గురించి మాట్లాడే ముందు ఆలోచి ంచి మాట్లాడాలని హితవు పలికారు. తిరుపతి దర్శల నాలలో అవినీతి జరగకూడదని నా కొడుకుకి అప్పగిం చాను. 2018లో దారిలో అమ్మేస్తున్న పీడిఎస్ బియ్యం లారీలు పట్టుకుని పెద్దాపురం పోలీస్ స్టేషన్ లో పెడితే దాని కాంట్రాక్టు పేరు మార్చుకోలేదా? నిన్న కాక మొన్న మీకు సంబంధించిన వాళ్ళ పీడీఎస్ బియ్యం లారీలు పట్టుకుంటే ఎమ్మెల్యే తన కొడుకు ద్వారా సెటిల్మెంట్ చేయించారని కొట్టు సత్యనారాయణ ఆరోపించారు. ఒక సలహా ఇస్తున్నా గోతులు పూడిపించాను అని చెప్పడం మానేసి రోడ్ల నిర్మాణానికి ఎంత మంజూరు చేశారో చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు.

# ఉంగుటూరు,భీమడోలులో శాఖాహార ర్యాలీ



**భీమడోలు, మేజర్ న్యూస్:**జంతువులను ప్రేమించాలని, శాఖాహారమే భుజించాలని భీమడోలు పిరమిడ్ సేవాదళ్ సభ్యులు పిలుపునిచ్చారు. ఆదివారం భీమడోలు గ్రామంలో స్థానిక పిరమిడ్ సేవాదళ్ ఆధ్వర్యంలో శాఖాహార ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా పిరమిడ్ సొసైటీ సభ్యులు స్థానిక సాయిబాబా ఆలయంవద్దనుండి గాంధీబొమ్మసెంటర్, సంత మార్కెట్ మీదుగాభీమడోలు జంక్షన్ వరకు శాఖాహారం తీసుకోవాలని, యోగుల ఆహారం శాఖాహారమని, జంతువుల పట్ల ప్రేమతో మెలగాలి అంటూ నినాదాలు చేస్తూ శాంతిర్యాలీ నిర్వహించారు.

మానవహారంగా ఏర్పడ్డారు. ఈసందర్భంగా పిరమిడ్ సొసైటీ మాష్టార్స్ వరలక్ష్మి, గోవిందయ్య, గేదెల అప్పన్న మాట్లాడుతూ భీమడోలు గ్రామంలో ఉమ్మడి జిల్లాకు చెందిన పిరమిడ్‌మాష్టార్స్ పాల్గొని శాఖాహార ర్యాలీ నిర్వహించినట్లు పేర్కొన్నారు. ఈనెల 11వ తేదీన తూర్పుగోదావరి జిల్లా పేరవరం వద్ద ఆసియాలోనే అతిపెద్ద వశిష్ట గోదావరి పిరమిడ్‌ను ప్రారంభిస్తున్నట్లు, కార్యక్రమానికి ప్రతి ఒక్కరు హాజరుకావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పిన్నింటి అప్పారావు, పంట్ల రాము, అనుపోజు రంగారావు, ఈడే గిరిబాబు, ఈతకోట సుబ్బా రావు తదితరులు పాల్గొన్నారు.

### రోడ్డు ప్రమాద నిందితుడి ఆచూకీ తెలపండి

**ఏలూరు,మేజర్ న్యూస్ :** ప్రమాదంలో ఒకరి మృతికి కారకుడైన వ్యక్తి ఆచూకీ తెలియజేయాలని చిలకలపూడి సిఐ కె.అబ్దుల్ నబి కోరారు. ఏలూరు రూరల్ మండలం పోణంగి కాలనీకి చెందిన బత్తుల పుల్లయ్య కుమారుడు నాగ జగన్నాధం అనే వ్యక్తి పై 2014లో రోడ్డు ప్రమాద సంఘటనలో చిలకలపూడి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసారు. బెయిల్ పొందిన అతను వాయిదాలకు హాజరు కాకపోవడంతో మచిలీపట్టణం ఫస్ట్ ఏడిఎం కోర్టు నాన్ బెయిలబుల్ వారంట్ జారీ చేసింది. పోలీసులు అతని కోసం గాలించినా ఆచూకీ లేదు. అతని వివరాలు తెలిసిన వారు చిలకలపూడి పోలీస్ స్టేషన్ 0867225 2233,సిఐ నెంబర్ 8332983789కు సమాచారం అందించాలని సిఐ కోరారు.

# ఆక్యుపంక్చర్ వైద్యంతో దీర్ఘకాలిక రోగాలు నయం




**బుట్టాయిగూడెం,మేజర్ న్యూస్ :** ఆక్యుపంక్చర్ వైద్యంతో ఎన్నో రకాల దీర్ఘకాలిక రోగాలు నయం చేయవచ్చని ఉమర్ ఆలీష రూరల్ డెవలప్మెంట్ ట్రస్ట్ పిఠాపురండాక్టర్‌మాకల సత్య నారాయణ, డాక్టర్ వంగర రేణుకా దేవిలు అన్నారు. ప్రపంచ ఆక్యుపెంచర్ డే సందర్భంగా మండలంలోని చీమల వారి గూడెం గ్రామంలో ఆక్యుపంచర్ చికిత్స కేంద్రాన్ని ఆదివారం ఏర్పాటు చేశారు.ఈసందర్భంగా డాక్టర్లు సత్యనారాయణ ,రేణుకా దేవి మాట్లాడుతూ ఆక్యుపంచర్ వైద్యంపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని అన్నారు.

కన్నాపురం,కొయ్యల గూడెం, వివిధ ప్రాంతాల నుండి వచ్చిన వారికి వైద్య సేవలు అందించినట్లు పేర్కొన్నారు.100 మందికి పైగా ప్రజలకు ఈ చికిత్స అందించిన్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రసాద్, రామరాజు,శశీ,ఉమేష్,రమా,పైడిపరు దుర్గ,కట్టాలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

### ఏజెన్సీలో దళితుల సమస్యలు పరిష్కరించాలి

**బుట్టాయిగూడెం,మేజర్ న్యూస్ :** ఏజెన్సీ ప్రాంతంలోని దళితుల సమస్యలు పరిష్కరించాలని అంబేద్కర్ యువజన సంఘం నాయకులు కనికెళ్ళ శ్రీనివాస్ అన్నారు. ఆదివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ దళిత కాలనీల్లో డ్రైనేజీలు అధ్వానంగా ఉన్నాయని మురికి నీరు వెళ్లే దారి లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని కొత్త డ్రైనేజీలు నిర్మించాలని ప్రభుత్వాన్ని కోరారు. అలాగే ఎస్సీ ఎస్టీలకు ఉచిత విద్యుత్ సక్రమంగా అమలు జరిగేలా చూడాలని కోరారు.

# టిడ్కో గృహ వాసుల కోసం రూ.8లక్షలతో కొత్తవాహనం

మొదటిపేజి తరువాయి

ఒకరోజు గడుస్తుందన్నారు. దృష్టిలో పెట్టుకుని గతంలో ఉచిత ప్రయాణ వాహనాన్ని ధర్మారావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశామని అప్పటినుంచి కాలనీ ప్రాంతవాసులు ఉదయం నుంచి రాత్రి వరకు ఫుల్ లోడుతో ఉచిత వాహనంలో రాకపోకలు సాగించేవారని అన్నారు.ఆవాహనం పాతది కావడంతో రిపేర్లు వచ్చాయన్నారు.కాలనీ వాసులకు ఇబ్బందులు తలెత్తకుండా అన్ని సౌకర్యాలతో కొత్తవాహనాన్ని కొనుగోలు చేసిఆదివారంకాలనీ వాసులు సమక్షంలో ప్రారంభించడం జరిగిందన్నారు. కాలనీవాసులకు ప్రత్యేకంగా ఉచిత వాహనాన్ని ఏర్పాటు చేసినందుకు మంత్రి రామానాయుడుకు కాలనీవాసులు,మహిళలు కృతజ్ఞతలు, తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు జీవి,పెచ్చెట్టి బాబు,బోనం చినబాబు, పొట్నూరి శ్రీనివాసరావు,జగ్గురోతు రాంబాబు, మామిడిశెట్టి పెద్దిరాజు ,బోనంనాని, అరిమిల్లి రామ శ్రీనివాసు, పీతల శ్రీనివాసు,చినమిల్లిగణపతి రావు,టిడిపి,జనసేన,బిజెపి నాయకులు, టిడ్కోకాలనీ మహిళలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

# గుంతలు లేని రోడ్లే లక్ష్యం

- రూ.20 కోట్లతో పలు అభివృద్ధి కార్యక్రమాలు
- హామీలన్నీ నెరవేరుస్తున్న ప్రభుత్వం - మంత్రి కొలుసు పార్థసారథి



చాట్రాయి,మేజర్‌న్యూస్ : ప్రజలు తమకు అందించిన అఖండ విజయాన్ని బాధ్యతగా స్వీకరించి పేద ప్రజల సంక్షేమానికి, రాష్ట్రాభివృద్ధికి కృషి చేస్తామని రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖా మంత్రి కొలుసు పార్థసారథి స్పష్టం చేశారు. ఆదివారం చాట్రాయి మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు రాష్ట్రగృహనిర్మాణ,సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రికొలుసు పార్థసారథిశంకుస్థాపన చేశారు. చాట్రాయి మండలం చాట్రాయి గ్రామంలో రూ 25 లక్షలు, చనుబంద గ్రామంలో రూ.50 లక్షలతో సిసి రోడ్లకు పనులకు మంత్రి శంఖుస్థాపన చేశారు. చాట్రాయి గ్రామంలో రోడ్ల మరమ్మత్తులకు రూ,30 లక్షల పనులు ప్రారంభించారు. అనంతరం చనుబంద గ్రామంలో గుంతలు లేని రోడ్డు నెట్ వర్క్ పనులను మంత్రి పార్థసారథి ప్రారంభించారు. ఈ సందర్భంగా స్వయంగా ప్రొక్లైనర్ ఎక్కి గుంతలు పూడ్చే కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం చనుబంద గ్రామంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మంత్రి పార్థసారథి మాట్లాడుతూ రాష్ట్రంలో గుంతలు లేని రోడ్లే తమ చేయమని స్పష్టం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా రూ. 820 కోట్ల రూపాయలతో ఆర్అండ్‌బి రహదారులు గుంతలు పూడ్చే కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున చేపట్టడం జరిగిందన్నారు. ఏలూరు జిల్లాలో 76 కోట్ల రూపాయలతో ఈ పనులు చేపడుతున్నామన్నారు.

ఈ పనులన్నింటినీ సంక్రాంతి లోపు పూర్తి చేసేందుకు అన్ని చర్యలు తీసుకుందాం జనవరి అనంతరం గౌరవ ముఖ్యమంత్రి రాష్ట్రంలో పర్యటించే సందర్భంలో ఎక్కడైనా గుంతలతో కూడిన రోడ్డు కనబడితే సంబంధిత అధికారులు సస్పెండ్ చేస్తామని ముఖ్యమంత్రి ఇప్పటికే హెచ్చరించడం జరిగిందన్నారు. నూజివీడు నియోజకవర్గంలో 20కోట్ల రూపాయల విలువైన పనులు చేపడుతున్నామన్నారు. ప్రజలు తమపై నమ్మకం ఉంచి అందించిన విజయాన్ని బాధ్యతగా భావిస్తున్నామన్నారు. ప్రజల ఆశలు,ఆకాంక్షలకు అనుగుణంగా పాలన అందించేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు కృతనిశ్చయంతో ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్అండ్‌బి ఎస్ఈ జాన్ మోషే,పలువురు ప్రజా ప్రతినిధులు, పాల్గొన్నారు.

## వక్ఫ్ పరిరక్షణ కోసం ఛలో విజయవాడ

- బస్సులను ప్రారంభించిన ముస్లిం మత పెద్ద ఇసాక్ మొహిద్దిన్




ఏలూరు,మేజర్ న్యూస్: ఆదివారం ఆంధ్రప్రదేశ్ జమాతే ఇస్లామీ హింద్ ఆధ్వర్యంలో విజయవాడలో కుమ్మరి పాలెం ఈద్ గాహ్ మైదానం నిర్వహిస్తున్న వక్ఫ్ పరిరక్షణ సభలో పాల్గొనడానికి ఏలూరు నుండి బయలుదేరుతున్న బస్సులను ఏలూరుకు చెందిన ముస్లిం మత పెద్ద షేక్ ఇసాక్ మొహిద్దిన్ జెండా ఊపి ప్రారంభించారు, ఈ సందర్భంగా షేక్ ఇసాక్ మొహిద్దిన్ మాట్లాడుతూ వక్ఫ్ చట్టసవరణ బిల్లు అత్యంత ప్రమాదకరమైనదని ఇది కేవలం ముస్లింల నుండి విలువైన భూములు కాజేయాలనే దురుద్దేశంతో చేస్తున్నటువంటి ఒక పెద్ద కుట్రని దీనిని ప్రతి ఒక్కరు ఎదుర్కోవాలని, వక్ఫ్ పరిరక్షణ గురించి ప్రతి ఒక్క ముస్లిం అవగాహన కలిగి ఉండాలని ముస్లిం సమాజం కోసం ముస్లింల సంక్షేమం కోసం ఉపయోగపడే వక్ఫ్ ఆస్తులను పరిరక్షించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఇది మన అందరి బాధ్యత అన్నారు. ఏలూరు అంజుమన్ -ఎ- ముహాఫీజుల్ ఇస్లాం ఆధ్వర్యంలో 10 బస్సులను సమకూర్చిన అంజుమన్ కమిటీ సభ్యులకు ఆయన ధన్యవాదాలు తెలిపారు.

## ఉమా కోటేశ్వరస్వామికి మంత్రి పార్థసారథి పూజలు



చాట్రాయి,మేజర్‌న్యూస్: చాట్రాయి మండలం పోలవరం గ్రామంలో వేంచేసిఉన్న శ్రీశ్రీశ్రీ ఉమాకోటేశ్వరస్వామిదేవస్థానంలో స్వామివారిని ఆదివారం రాష్ట్ర గృహనిర్మాణ సమాచారశాఖ మంత్రి కొలుసు పార్థసారథి దర్శించుకుని ప్రత్యేకపూజలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి పార్థసారథి మాట్లాడుతూ రాష్ట్ర ప్రజానీకం సుభిక్షంగా ఉండాలని,రాష్ట్ర జిల్లా నియోజకవర్గ ప్రజలు సుఖ సంతోషాలతో వర్ధిల్లాలి అని ఆకాంక్షిస్తూ ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు..

ప్రజలందరికీ సకలశుభాలు కలగాలని,అందరి జీవితాల్లో విఘ్నాలు తొలగిపోయి విజయాలు సిద్ధించాలని ఆకాంక్షించారు. ఉమా కోటేశ్వరస్వామి ఆశీస్సులతో రాష్ట్రంలోని, జిల్లాలోని ప్రతీ కుటుంబం సుఖ సంతోషాలతో,అభివృద్ధిలో ముందడుగు వేయాలని అభిలాషించారు. అలాగే రాష్ట్ర సమగ్రాభివృద్ధికి, సంక్షేమ కార్యక్రమాలకు అమలుకు ప్రజలు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# కానూరి అమర జీవి - సిపిఎం జిల్లా కార్యదర్శి బలరాం



నరసాపురం,మేజర్‌న్యూస్ : కార్మిక, ప్రజా ఉద్యమనేత కానూరి బ్రహ్మాజీరావు అమరజీవి అని సిపిఎంపార్టీ జిల్లా కార్యదర్శి బి.బలరాం కొనియాడారు. ఆదివారం బ్రహ్మాజీరావు స్వగృహం నందు ఆయన మృతదేహానికి సిపిఎం పార్టీ సిపిఐ పార్టీ బృందం పూలమాలలేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు బలరాం ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మిక ఉద్యమ నేత మహమ్మద్ మీరాతో కలిసిఅనేక కార్మిక ప్రజా ఉద్యమాలలో బ్రహ్మాజీరావు చురుకైనపాత్రను నిర్వహించారన్నారు. నిస్వార్థ ప్రజానాయకుడిగా నిత్యం ప్రజల పక్షాన బడుగు జీవుల పక్షాన పని చేసిన బ్రహ్మాజీరావు అమరజీవిని కొనియాడారు. అనంతరం ఆయన పార్థివ దేహాన్ని కుటుంబ సభ్యులు బంధుమిత్రులు పార్టీ కార్యకర్తలు ఎర్రజెండాలతో ఊరేగింపుగా జోహార్లు అర్పిస్తూ పట్టణంలో గాంధీవిగ్రహం, అంబేద్కర్ సెంటర్ మీదుగా మొగల్తూరు రోడ్లో పార్కుల మీదుగా ఊరేగిస్తూ హిందూ స్మశాన వాటికలో ఆయన అంత్యక్రియలు నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ జిల్లా కార్యవర్గసభ్యులు కవురుపెద్దరాజు, పట్టణ కార్యదర్శి ముచ్చర్ల త్రిమూర్తులు, మండల కార్యదర్శి జల్లి రామ్మోహనరావు, జిల్లాకమిటీ సభ్యురాలు పొగాకు పూర్ణ, పట్టణ కమిటీ సభ్యులు మంచిలి నీలకంఠం,పొగాకునారాయణరావు, నోములకొండ, మొగల్తూరు మండల నాయకులు ఎడ్ల చిట్టిబాబు,ఆదుర్తి సాంబమూర్తి, సిపిఐ సీనియర్ నాయకులు నెక్కంటి సుబ్బారావు,ఆరేటి మృత్యుంజయ తదితరులు పాల్గొన్నారు.

## దేవాంగ చేనేతలకు అన్యాయం

- యూత్ అధ్యక్షుడు మావూరి



నర్సాపురం,మేజర్ న్యూస్ : రాష్ట్రంలో దేవాంగ చేనేత కులానికి నామినేటెడ్ పదవుల్లో తీవ్ర అన్యాయం జరిగిందని దేవాంగ యూత్ అధ్యక్షులు, టిడిపి యూనిట్ ఇంచార్జ్ మావూరి ఆనంద్ కుమార్ అన్నారు. ఆదివారం నరసాపురంలో ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 16 లక్షల జనాభా వున్న దేవాంగ చేనేత వర్గానికి నామినేటెడ్ పదవులలో తీవ్ర అన్యాయం జరిగిందని,కేవలం ఒకే ఒక చేనేత వర్గానికే పదవి ఇచ్చారన్నారు.మిగిలిన వారికీ ఒక్క నామినేటెడ్ పదవి కూడా ఇవ్వలేదని, తెలుగుదేశంపార్టీ పెట్టినప్పటి నుండి దేవాంగ సమాజం పార్టీకి అండగా వుంటూ పార్టీ విజయానికి కృషి చేసిందన్నారు. అసెంబ్లీ పార్లమెంట్ ఎన్నికల్లో దేవాంగులకు ఒక్క సీటు కూడా కేటాయించలేదని ఆయన అన్నారు.ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మాపై దృష్టి సారించి దేవాంగ కార్పొరేషన్, నామినేటెడ్ పదవుల్లో సముచిత స్థానం కల్పించాలని ఆయన కోరారు.

## చిన్న వెంకన్న సేవలో ఎండోమెంట్ ట్రిబ్యునల్ న్యాయమూర్తి



ద్వారక తిరుమల,మేజర్ న్యూస్: రాష్ట్ర ఎండోమెంట్ ట్రిబ్యునల్ న్యాయమూర్తి ఆదివారం ఉదయం ఆలయానికి విచ్చేశారు. ఆయనకు ఆలయ అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలుకుగా స్వామి అమ్మవార్లను దర్శించుకున్న ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. అనంతరం ఆలయ ముఖమండపంలో వేద పండితులు వేద ఆశీర్వచనాలు పలికి స్వామివారి శేష వస్త్రాన్ని ప్రసాదాలను అందజేశారు.ఆలయ సూపరింటెండెంట్ గోవాడ సుబ్రహ్మణ్యం స్వామివారి జ్ఞాపకం అందించారు. ఈ క్రమంలో ఆలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## కోడిపందాల స్థావరంపై దాడి

- 8 మందిపై కేసు నమోదు



కొయ్యలగూడెం,మేజర్‌న్యూస్:పోలవరం డిఎస్పిఎం వెంకటేశ్వర రావు ఆదేశాలపై పోలవరం సిఐ బాల సురేష్ ఆధ్వర్యంలో కొయ్యలగూడెం ఎస్ఐ చంద్రశేఖర్ కోడిపందాల శిబిరంపై దాడి చేశారు. ఎస్ఐ సిబ్బందితో కలిసి గంగవరం గ్రామం శివారులో కోడి పందాలు స్థావరంపై దాడులు నిర్వహించగా 8 మంది వ్యక్తులు కోడి పందాలు నిర్వహిస్తుండగా వారిని అదుపులోనికి తీసుకున్నారు. వారి వద్ద నుండి 61వేల రూపాయలను,6 మోటార్ సైకిళ్ల ను,మూడు కోడి పుంజులను స్వాధీనం చేసుకొని వారిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఎస్ఐ చంద్రశేఖర్ మాట్లాడుతూ గ్రామాలలో ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు అనగా కోడి పందాలు,పేకాట లు నిర్వహిస్తే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎవరైనా కోడిపందాలు పేకాటలో నిర్వహిస్తున్నటు వంటి సమాచారాన్ని డయల్ 112కు గాని లేదా తన ఫోన్ నెంబర్ 9440796666కు సమాచారం అందించిన ఎడల చట్టప్రకారం జూదరులపైచర్యలు తీసుకుంటామని వివరించారు.

## జనవరి 5న విజయవాడలో
# హైందవ శంఖారావం - విజయవంతం చేయాలి





**విహెచ్‌పి రాష్ట్ర ఉపాధ్యక్షులు వేణుగోపాల్ రాజు - సమావేశంలో ఎమ్మెల్యే కామినేని, గారపాటి చౌదరి తదితరులు**

**ఏలూరు,మేజర్ న్యూస్ :** హిందూ దేవాలయాలను ప్రభుత్వ నియంత్రణ నుండి విముక్తి చేసి హిందూ ధార్మిక సంఘాలకు అప్పగించాలనే డిమాండ్‌తో వచ్చే జనవరినెల 5వ తేది న విజయవాడ లో హైందవ శంఖారావం భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నామని విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షులు రుద్రరాజు వేణుగోపాల్ రాజు అన్నారు. ఆదివారం ఏలూరులోని గ్రాండ్ కృష్ణ కళ్యాణ మండపంలో హైందవ శంఖారావం జిల్లా సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి శ్రీ యాజ్ఞ వల్క్య రాజాశ్రమాధిపతులు కృష్ణచరణానంద భారతీ స్వామీ,విశ్వహిందూ పరిషత్ క్షేత్ర విధినిధి ప్రముఖ్ కస్తూరి సూర్య ప్రకాష్,ఏలూరు జిల్లా సంఘచాలక్ గడ్డమనుగు సత్యనారాయణ,ప్రాంత కళాశాల విద్యార్థి ప్రముఖు వంశీకృష్ణ ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రసంగించారు. అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షులు వేణుగోపాల్ రాజు మాట్లాడుతూ నాలుగు లక్షలమంది తో విజయవాడలో నిర్వహిస్తున్న హైందవ శంఖారావ సభ ద్వారా దేశవ్యాప్తంగా హిందూ దేవాలయాలను ప్రభుత్వ నియంత్రణ నుండి విముక్తి చేసి స్వయం ప్రతిపత్తి కలిగిన ధార్మిక వ్యవస్థకు అప్పగిస్తూ వెంటనే చట్టం చేయాలని విశ్వహిందూ పరిషత్ ఒక జాతీయ ఉద్యమానికి శ్రీకారం చుట్టిందని అన్నారు.

దేవాలయ ట్రస్ట్ బోర్డులలో రాజకీయ పార్టీలతో సంబంధం లేకుండా హిందూ దైవ భక్తులకుమాత్రమే స్థానం కల్పించాలని, హైందవ శంఖారావ సభకు పెద్ద సంఖ్యలో హిందువులు ప్రతి గ్రామం నుండి తరలివచ్చి విజయవంతం చేయాలని కృష్ణ చరణానంద భారతి స్వామీజీ విజ్ఞప్తి చేశారు. ఈసందర్భంగా హైందవశంఖారావం కరపత్రాన్ని ఆవిష్కరించారు. కైకలూరు ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్, బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గారపాటి సీతారామాంజనేయ చౌదరి(తపనచౌదరి), విశ్వహిందూ పరిషత్ ,బిజెపి నాయకులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

# సందర్శకులకు పూర్తిస్థాయిలో ఏర్పాట్లు చేయండి

**- అధికారులకు ఎమ్మెల్యే నాయకర్ ఆదేశం**



**మొగల్తూరు,మేజర్‌న్యూస్ :** కార్తీకమాసం సందర్భంగా పేరుపాలెం కెపిపాలెం సాగర తీరాలకు వచ్చే సందర్శకులకు పూర్తి స్థాయిలో నిర్దేశించిన ఏర్పాట్లుచేయాలని ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ అధికారులను ఆదేశించారు. ఆదివారం తీరం నందు చేస్తున్న ఏర్పాట్లును ఆయన పరిశీలించారు.

ఈసందర్భంగా ఆయన తీరం నందు వర్తకులను, స్థానికులను ఏర్పాట్లుపై ఆరా తీశారు. కార్తీక మాసం నెల రోజులు పాటు పలు జిల్లాల నుండి లక్షలాది మంది సందర్శకులు వచ్చేఅవకాశం ఉన్నందున ఆమేరకుతీరం నందుఅన్ని ఏర్పాట్లు త్వరితగతిన పూర్తి చేయడంతో పాటు ఎటువంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమం లో జిల్లా పంచాయతీ అధికారిని బి.అరుణాశ్రీ,డిఎస్పీ మురళీ కృష్ణ, కెపిపాలెంసౌత్ సర్పంచ్ అందే వెంకట లక్ష్మీ దొరబాబు, వలవల నాని బల్ల హనుమంత్,అంటే జగదీష్ మెహర్ బాబా, సత్యనారాయణ, బాలకృష్ణ పేరుపాలెం సౌత్ సర్పంచ్ తిరుమాని విజయలక్ష్మీ, నర్సింహస్వామి,మాజీ సర్పంచ్ మేళం బన్ను నియోజవర్గ జనసేన,టిడిపి,బిజెపి నాయకులు పాల్గొన్నారు.

# గోదావరి పుష్కరాల ముహూర్తం ఖరారు - ఈ సారి ప్రత్యేకత..!!



కోట్లాది మంది పవిత్రంగా భావించే గోదావరి పుష్కరాలకు ముహూర్తం ఖరారైంది. దేశ విదేశాల నుంచి గోదావరి పుష్కరాలకు తరలి రానున్నారు. దీంతో, ప్రభుత్వం..స్థానిక నేతలు - యంత్రాంగం అప్రమత్తం అయ్యారు. ముందస్తు కార్యాచరణ సిద్దం చేస్తున్నారు. చేపట్టాల్సిన పనులపైన నిర్ణయానికి వచ్చారు. ఈ సారి గోదావరి పుష్కరాల నిర్వహణలో ఎన్నో ప్రత్యేకతలు ఉన్నాయి. తాజాగా పుష్కరాల నిర్వహణ కోసం పలు నిర్ణయాలు తీసుకున్నారు. 2027 జూలై 23 నుంచి ఆగస్టు 3 వరకు గోదావరి పుష్కరాల నిర్వహణకు నిర్ణయించారు. ప్రతీ 12 ఏళ్లకు ఒకసారి జరిగే పుష్కరాల కోసం ప్రభుత్వం ఏర్పాట్లు మొదలు పెట్టింది. 2015 లో ఇదే గోదావరి పుష్కరాల ప్రారంభం వేళ చోటు చేసుకున్న ఘటనలు విషాదం మిగుల్చాయి. ఈ సారి పుష్కరాల కోసం 8 కోట్ల మంది భక్తులు వస్తారని అంచనా వేస్తున్నారు. దీంతో గోదావరి జిల్లాల్లో పుష్కర ఘాట్ల అభివృద్ధికి రూ.904 కోట్లతో ప్రతిపాదలు అధికార యంత్రాంగం సిద్ధం చేసింది. సుమారు రెండున్నరేళ్ల కంటే ఎక్కువ సమయం ఉన్నప్పటికీ ప్రజాప్రతినిధులు, అధికారులు ఇప్పటి నుంచే రంగంలోకి దిగారు. పుష్కర ఏర్పాట్ల పైన కీలక కసరత్తు చేశారు.

- నిధుల కేటాయింపు - అఖండ గోదావరి పుష్కరాలు-2027 ముసాయిదా యాక్షన్ ప్లాన్ కూడా సిద్ధమైంది. అందరూ ఒకే ఘాట్‌లో స్నానాలు చేసే అవసరం లేకుండా గోదావరి నదిలో ఎక్కడైనా స్నానాలు చేయవచ్చని ప్రచారం చేయనున్నారు. ప్రస్తుతం ఉన్న 17 ఘాట్లకు రోజుకు 75,11,616 మంది వస్తారని అంచనా వేశారు. మరో నాలుగు కొత్త ఘాట్లు అవసరమని భావిస్తున్నారు. యాత్రికుల బస ఏర్పాట్లపై చర్చించారు. రాజమహేంద్రవరం పరిధిలో గోదావరి ఘాట్ల అభివృద్ధికి రూ.904 కోట్లతో బడ్జెట్ ప్రతిపాదించారు. కార్పొరేషన్ రోడ్ల అభివృద్ధికి రూ.456.5 కోట్లు, ఆర్‌అండ్‌బీ రోడ్లు, బ్రిడ్జిల అభివృద్ధికి రూ.678.76 కోట్లతో ప్రతిపాదనలు చేశారు. సిటీ బ్యూటిఫికేషన్, ఐకానిక్ టూరిజం సైట్ ప్రాజెక్టు కోసం రూ.75 కోట్లతో ప్రతిపాదించారు.

- ముందస్తు ఏర్పాట్లు -ఈదఫా గోదావరి పుష్కరాలకు జిల్లాను యూనిట్‌గా తీసుకుని శాశ్వత ప్రాతిపదికన పనులు చేపట్టాలని నిర్ణయించారు. పుష్కరాలకు వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఇప్పటి నుంచే రద్దీ, ట్రాఫిక్ నియంత్రణ, తదితర అంశాలను దృష్టిలో పెట్టుకుని ఏర్పాట్లు చేస్తామని మంత్రులు చెబుతున్నారు. గోదావరి పుష్కరాలు 2047కు విజనరీతో ముందుకు వెళ్లనున్నారు. దీనికి సంబంధించిన నిధులను సమీకరించుకుని, సమగ్ర అభివృద్ధి యాక్షన్ ప్లాన్ రూపొందించనున్నారు.

## లాభసాటిగా ప్రకృతి వ్యవసాయం



**ముదినేపల్లి,మేజర్ న్యూస్ :** అనాదిగా ఉన్న వ్యవసాయమే ప్రకృతి వ్యవసాయమని ముదినేపల్లి మండల ప్రకృతి వ్యవసాయ ఇంచార్జ్ గౌతమ్ కుమార్ అన్నారు. మండలంలోని చేవూరుపాలెం అంగనవాడి కేంద్రంలో ప్రకృతి వ్యవసాయంపై అంగనవాడి కార్యకర్తలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాభావపరిస్థితులు,భూగర్భజలాలు అంతరించి పోతున్న కాలంలో మహిళలు, రైతులు తమకున్న భూమిలో పలు ఫలసాయ పంటలు పెరట్లో వేసుకొని సేంద్రియ ఎరువులతో సాగు చేసుకుని అత్యధిక దిగుబడులను సాధించి అధిక లాభాలు పొందొచ్చన్నారు. పండించిన పంటను వారి గ్రామాల్లో విక్రయించుకుని జీవనోపాధి చేసుకోవచ్చన్నారు. పోషన్ వాటికా (న్యూట్రిగార్డెన్)కార్యక్రమంలోఅంగన్వాడీకార్యకర్తలకు అవగాహన కల్పించారు. ఈకార్యక్రమంలో వడాలి,సంకర్షణపురం, గురజ,పెనుమల్లి,అల్లూరు,బొమ్మినంపాడు గ్రామాల అంగనవాడి కార్యకర్తలు ,సూపర్వైజర్ ప్రసూన, ప్రకృతి వ్యవసాయ ఐసిఆర్పి సుధాకర్ పాల్గొన్నారు.

## రాజవల్లి రాధా రమణ,ఐ హాస్పిటల్‌లో నూతన వైద్య పరికరాలు

- ప్రారంభించిన మంత్రి డా.'నిమ్మల'



**పాలకొల్లు,మేజర్ న్యూస్:**స్థానిక రాజవల్లి రాధా రమణ లయన్స్, కంటి ఆసుపత్రి సంయుక్త వేడుకల్లో స్థానిక కోట్ల విలువైన ఆధునిక వైద్య పరికరాల ఛాంబర్ ను ప్రారంభించిన రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడుచే ప్రారంభించారు, ఈ సందర్భంగా రామానాయుడు మాట్లాడుతూ స్వచ్ఛంద సేవా సంస్థలు పేదలకు చేస్తున్న సేవలుపై కొనియాడారు, కోట్ల విలువైన ఆస్తిని అప్పట్లో బొండాడరాధారణ గుప్త దానం చేయడం ఎంత మందో నిరుపేదలకు కంటి చూపుకు వెలుగునిచ్చారని అన్నారు, ఈ కార్యక్రమంలో చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు కారుమూరి వెంకట నరసింహారావు, సిహెచ్ పాపారావు నాయుడు తదితరులు పాల్గొన్నారు,

## ఎమ్మెల్సీ ఎన్నిక,సభ్యత్వ నమోదుపై టిడిపి సమావేశం



**ద్వారకతిరుమల,మేజర్‌న్యూస్:** స్థానిక యాదవ్ కళ్యాణ మండపంలో ఆదివారం సాయంత్రం తెలుగుదేశం పార్టీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు.

ఈ సమావేశంలో పట్టబద్రుల ఎన్నిక నిమిత్తం అర్హులైన వారిని జాయిన్ చేయడం గురించి. అలాగే తెలుగుదేశం పార్టీ సభ్యత్వం నమోదు కార్యక్రమంలో అధిక సంఖ్యలో సభ్యత్వం నమోదు చేసి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని పార్టీ నాయకులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఇమ్మడి రత్నాజీ, మట్టపర్తి రూపేష్ కుమార్, కూరాకుల బుజ్జి, రేవూరి వెంకటేశ్వరరావు, నరం త్రిమూర్తులు, గువ్వల మావుళ్ళ రావు, ఉర్ల శ్రీను, పాకనాటి శేషు, వీసం నాగబాబు, తేలు అనిల్ కుమార్, చిలుకూరి హరిబాబు, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, పాల్గొన్నారు.

# 'గూడెం'లో ది జాంపేట కోఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ ప్రారంభం

**తాడేపల్లిగూడెం,మేజర్‌న్యూస్:** ప్రముఖవాణిజ్యకేంద్రమైన తాడేపల్లి గూడెంలో ది.జాంపేట కోఆపరేటివ్ అర్బన్ బ్యాంకు 12వ బ్రాంచ్ ను ఆదివారం ప్రారంభించారు.ముఖ్యఅతిథిగా హాజరైనస్థానిక శాసనసభ్యులు బొలిశెట్టి శ్రీనివాస్ ప్రారంభించారు. తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి వలవల మల్లికార్జునరావు(బాబ్జి)జ్యోతిప్రజ్వలన చేశారు. అతిథులు చేతులమీదుగా బ్యాంకులోని వివిధ విభాగాలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు చైర్మన్ బొమ్మన జయ కుమార్, వైస్ చైర్మన్ రొబ్బి విజయ శేఖర్, విశాఖపట్నం కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ చైర్మన్ చలసాని రాఘవేంద్రరావు, ఏలూరు కోఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ చైర్మన్ అంబికా ప్రసాద్, తణుకు వాణి కోఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ చైర్మన్ ఎం. వెంకటరత్నం, ది ఆర్యాపురం కోఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ చైర్మన్ చల్లా శంకర రావు, ది ఇన్నిస్ పేట కోఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ చైర్మన్ కోలా అచ్యుతరామయ్య విశిష్ట అతిథులుగా హాజరయ్యారు.

ది జాంపేట కోఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ సీఈవో ఎం.విజయ ప్రతాప్, డిప్యూటీ సీఈవో ఎన్.భరణి కుమార్, బ్యాంకు డైరెక్టర్లు, వివిధ బ్రాంచీల సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రజలే భాగస్వామ్యులుగా సహకార రంగంలో బ్యాంకులు అందిస్తున్న సేవలు అభినందనీయమని ప్రశంసించారు. మరో ఏడాదిలో 100వసంవత్సరంలోకి అడుగుపెడుతూ అడుగుపెడుతూ 12వ బ్రాంచిగా తాడేపల్లిగూడెంలో ఏర్పాటుచేయడంపట్ల ధన్యవాదాలు తెలియజేశారు. ఈబ్యాంకు సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. టిడిపి నియోజకవర్గ ఇన్చార్జి వలవల బాబ్జి మాట్లాడుతూ సహకార బ్యాంకింగ్ రంగంలో ది జాంపేట కోఆపరేటివ్ అర్బన్ బ్యాంకు



అందిస్తున్న సేవలు ప్రశంసనీయమైనవి అన్నారు. బ్యాంకు చైర్మన్ బొమ్మన జయ కుమార్ మాట్లాడుతూ 1926లో కేవలం 500 రూపాయలతో ప్రారంభమైన ది జాంపేట కోఆపరేటివ్ అర్బన్ బ్యాంకు నేడు అందరి సహకారంతో 720కోట్లు రూపాయలు బ్యాంకింగ్ వ్యాపారం చేస్తూ ఖాతాదారులకు విశేషమైన సేవలు అందిస్తుందన్నారు. తమ బ్యాంకు ఇప్పటికే 11 బ్రాంచ్‌లు కలిగి ఉందని,12వ బ్రాంచ్‌ను తాడేపల్లిగూడెంలో ఏర్పాటు చేశామన్నారు.ఖాతాదారుల సేవలో 99 సంవత్సరాలు పూర్తిచేసుకుని 100వ సంవత్సరంలోకి ప్రవేశించబోతున్నా మని బ్యాంక్ చైర్మన్ బొమ్మన జయ కుమార్ తెలియజేశారు.ఈ కార్యక్రమంలో పలువురు ఖాతాదారులు పాల్గొన్నారు.

# విద్యావంతులు ఓటరుగా నమోదు కావాలి

## - ఎమ్మెల్యే చిర్రి బాలరాజు



**జీలుగుమిల్లి,మేజర్‌న్యూస్:** విద్యావంతులు ప్రతి ఒక్కరు ఎమ్మెల్సీ ఎన్నికకు ఓటర్ గా నమోదు కావాలని తమ కోసం పనిచేసే ప్రతినిధికి అండగా నిలవాలని శాసనసభ్యులు చిర్రి బాలరాజు విజ్ఞప్తి చేశారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఓటు హక్కు నమోదు రిజిస్ట్రేషన్‌కి అతి తక్కువ సమయం ఉందని రిజిస్ట్రేషన్ చేసుకోవలసిన వారు 3 రోజులలో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలియజేశారు. గత అసెంబ్లీ ఎన్నికలలో ఓటు వేయకపోయినా ఇప్పుడు ఓటు పొందవచ్చు అని అన్నారు. ఓటు నమోదు చేసుకునేవారు నవంబర్ 1 తేదీ 2021 లోపు డిగ్రీ పూర్తి చేసి ఉండాలి. ప్రతి ఒక్కరు కొత్తగా నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. గతంలో నమోదు చేసుకున్న ఓటు చెల్లుబాటు కాదు. ఆధార్ కలిగి గ్రాడ్యుయేట్ పూర్తి అయిన ప్రతి ఒక్కరు ఓటు పొందవచ్చు. డిగ్రీ ఒరిజినల్ సర్టిఫికెట్ లేదా డిగ్రీ పాస్ మార్క్ మెమోస్ జిరాక్స్, ఆధార్ కార్డు జిరాక్స్, ఓటర్ ఐడి, పాస్ ఫోటో,మొబైల్ నెంబర్, అన్ని జిరాక్స్ కాపీలపై సెల్ఫ్ అటెస్టేషన్ చేసి గెజిటెడ్ ఆఫీసరుచే అటెస్టేషన్ చేయించాలి అని తెలిపారు. గ్రాడ్యుయేట్స్ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రతి ఒక్కరు తమ కోసం కష్టపడే వ్యక్తికి ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

# స్వామి వారిని దర్శించుకున్న మంత్రి పార్థసారధి



**ఆగిరిపల్లి ,మేజర్ న్యూస్ :** ఆగిరిపల్లి మండలం అడవినెక్కలం గ్రామంలోని శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని రాష్ట్ర గృహ నిర్మాణ,సమాచార పౌర సంబంధాల శాఖా మంత్రి కొలుసు పార్థసారథి ఆదివారం సందర్శించారు. ఆలయంలో స్వామిని దర్శించుకుని ప్రత్యేకపూజలు చేశారు.ఆలయంలో అయ్యప్ప స్వాముల పూజా కార్యక్రమంలో మంత్రి పార్థసారథి పాల్గొన్నారు.మంత్రి వెంట వివిధ సంఘాల నాయకులు,స్థానిక ప్రజాప్రతినిధులుపాల్గొన్నారు.

# 14వ వార్డులో 'దేశం' సభ్యత్వ నమోదు



**నర్సాపురం,మేజర్‌న్యూస్ :** పట్టణంలోని 14వ వార్డులో ఆదివారం తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదును చేపట్టారు.ఈ కార్యక్రమంలో పార్టీ ఇంచార్జ్ పొత్తూరి రామ రాజు,పట్టణ అధ్యక్ష కార్యదర్శులు కొల్లుపెద్దిరాజు, జక్కం శ్రీమన్నారాయణ,కొప్పాడ రవీంద్రనాథ్ ఠాగూర్, వాటాల శేఖర్, ఎండి షాజహాన్,ఎండి మౌలాలి,వాతాడి ఉమా మహేశ్వరరావు,సంకరపు వెంకటేశులు,మేక శ్రీను, కోరాడ పాపారావు,నందారామకృష్ణ,వార్డునాయకులు పాల్గొన్నారు.

# జిల్లాస్థాయి వేడుకలలో విజేతలైన ఉపాధ్యాయులకు అభినందనలు



ద్వారకాతిరుమల, మేజర్ న్యూస్: యుటిఎఫ్ స్వర్ణోత్సవాల్లో భాగంగా ఆదివారం ఏలూరు డీసీఎంఎస్ ఫంక్షన్ హాల్‌లో జరిగిన జిల్లా స్థాయి వేడుకలలో పంగిడిగూడెం హైస్కూల్ ఉపాధ్యాయులు మద్దాల పెద్దిరాజు కు క్యారమ్స్ జిల్లా స్థాయి ప్రథమ విజేతగా,పైడి రాజేశ్వరమ్మ 400మీటర్లు నడకలో జిల్లా ప్రథమ విజేతగా,దొరసానిపాడు యూపీ స్కూల్ ఉపాధ్యాయుడు నంబూరి రాంబాబు 400మీటర్స్ నడకలో జిల్లా స్థాయి విజేతగా నిలిచారు. వీరి ముగ్గురికి ప్రశంసాపత్రం, జ్ఞాపికను జిల్లా యూటీఎఫ్ నాయకులు అందజేశారు. ఈ సందర్భంగా మండల యూటీఎఫ్ నాయకులు జయరాజు,కట్టా శ్రీనివాసు,దేవానందం మొదలగు నాయకులు విజేతలను అభినందించారు.

# 22న ఏలూరులో ఉమ్మడి ప.గో.జిల్లా మాదిగల ఆత్మీయ సమావేశం



**ఏలూరు,మేజర్‌న్యూస్:** ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందా కృష్ణ మాదిగ ఆదేశాల మేరకు ఆదివారం ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా మాదిగల ఆత్మీయ సమావేశం స్థానిక ఇశ్రాయేలు పేట, డాక్టర్ బాబు జగజీవన్ రావ్ భవన్‌లో జరిగింది.ఈ సమావేశానికి ఎంఆర్‌పిఎస్ జాతీయ అధ్యక్షులు, డాక్టర్ మున్నంగి నాగరాజు మాదిగ ,రుద్రపోగు సురేష్ మాదిగ (ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర అధ్యక్షులు),పేరెల్లి ఎలీషా మాదిగ (ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి) ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.ఈ నెల 22న ఏలూరులో జరిగే ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా మాదిగల ఆత్మీయ సమ్మేళనానికి ముఖ్యఅతిథిగా విచ్చేయుచున్న ఎస్ సి రిజర్వేషన్ల వర్గీకరణ విజయసారథి మందా కృష్ణ మాదిగని ఘనంగా స్వాగతం పలకాలని నిర్ణయించడం జరిగింది. ఆంధ్రప్రదేశ్‌లో ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ చట్టాన్ని అమలు చేయకుండా ఎలాంటి ఉద్యోగ నియామకాలు,ప్రకటనలు చేపట్టారాదని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి విజ్ఞప్తి చేశారు.ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో వేగంగా సుప్రీంకోర్టు తీర్పును గౌరవించి ఎస్సీ వర్గీకరణ అమలు చేయించేందుకు ప్రత్యేక చొరవ చూపాలని ఎన్‌డిఎ కూటమి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశానికి బయ్యావరపు రాజేశ్వరరావు మాదిగ (ఎంఎస్‌పి రాష్ట్ర నాయకులు), కందుల రమేష్ మాదిగ (ఎంఎస్‌పి ఏలూరు జిల్లా అధ్యక్షులు),నమ్మిన నాగార్జున మాదిగ ( ఎంఆర్‌పిఎస్ ఏలూరు జిల్లా అధ్యక్షులు),యార్లగడ్డ రత్నరాజు మాదిగ (ఎంఆర్‌పిఎస్ పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్షులు), పలివెళ్ళ పైడియ్య మాదిగ (ఎంఎస్‌పి పశ్చిమ గోదావరి జిల్లా అధ్యక్షులు), కనగల శేఖర్ మాదిగ, పసుపులేటి చిన బాబు మాదిగ, చౌటుపల్లి విజయ మాదిగ, నక్షత్ర మాదిగ, నమ్మిన కృష్ణ కుమారి మాదిగ , హైమావతి మాదిగ, ఝాన్సీ మాదిగ, కాశీ మాదిగ, సిద్దు మాదిగ, ఏలీయా మాదిగ, కలపాల బెంట్లి, కారూరి నాగ మాదిగ తదితరులు పాల్గొన్నారు.

# పేకాట శిబిరంపై పోలీసుల దాడీ : 8 మంది అరెస్టు



**జీలుగుమిల్లి,మేజర్‌న్యూస్:** పోలవరం డిఎస్పిఎం వెంకటేశ్వరరావు ఆదేశాలపై జీలుగుమిల్లి ఇన్స్పెక్టర్ బి.వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో జీలుగుమిల్లి ఎస్ఐ నవీన్ కుమార్‌కి రాబడిన సమాచారం మేరకు ఎస్సై వారి సిబ్బందితో కలిసి పేకాట స్థావరంపై దాడులు నిర్వహించారు. ఎనిమిది మంది వ్యక్తులను అదుపులోనికి తీసుకుని వారి వద్దనుండి రూ.4400 రూపాయల ను స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేసినట్టుగా ఎస్ఐ తెలిపారు. ఈ సందర్భంగా సబ్ ఇన్స్పెక్టర్ మాట్లాడుతూ పోలీస్ స్టేషన్ పరిధిలో అసాంఘిక కార్యకలాపాలు నిర్వహించే వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని, జూదాలకి పాల్గొనకూడదని,పేకాట కోడిపందాల్లో పాల్గొంటే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.